దిగితే అడుగున ఓ పెద్ద రాయి కనిపించింది. దాన్ని నేను బయటకి తీస్తే తడిసి ఉందది. దాని తడి ఎంతలోతుగా ఉందో తెలుసుకుందామని నేనా రాయిని బద్దలు కొట్టి చూస్తే లోపలంతా పొడిగా ఉంది తప్ప ఎంతో కాలంగా అది నీటి మధ్య ఉన్నా నీరు దాన్లోకి చొచ్చుకుపోలేక పోయింది. అలాగే కొన్ని శతాబ్దాలుగా యూరప్‌లో క్రిస్టియానిటీ ఉన్నా, ఇక్కడ నివసించే వారిలోకి క్రిస్టియానిటీ చొచ్చుకుపోయి, వాళ్ళల్లో అది నివసించడం లేదు. దాంతో ఇక్కడ రెండు ప్రపంచ యుద్ధాలు జరిగాయి. గాడ్సే విషయంలో కూడా ఇదే జరిగింది. మనం స్పాంజ్‌లా జీవించాలి తప్ప బండరాయిలా కాదు. అదే ఎవరైనా తమ మతాన్ని గౌరవించే విధానం.''

## 147. మార్పు

ఓ గ్రామంలో నివసించే ఒకామెకి పండరీపురానికి కాలి నడకన వెళ్ళి పండరీ నాథుడికి పూజలు చేస్తే, తమ కుటుంబానికి మంచి జరుగుతుందని తెలిసింది. ఇరుగు పొరుగు అక్కడికి వెళ్తూండటంతో ఆమె కూడా పండరీపురానికి వాళ్ళ వెంట వెళ్ళడానికి నిశ్చయించుకుంది.

''నన్ను ఒంటరిగా వదిలి వెళ్తున్నావు. నా సంగతి ఎవరు చూస్తారు?'' కోపంగా అడిగాడు భర్త.

''పన్నెండు రోజులేగా. ఎలాగో సద్దుకోండి.'' జవాబు చెప్పింది ఆమె.

దారిలో తినడానికి కొన్ని రొట్టెలు చేసుకుని కాలి నడకన బయలుదేరింది. పాండురంగడికి అర్చన చేసి చెప్పిన టైంకి తన గ్రామానికి వచ్చేసింది. తిరిగి వచ్చిన ఆమెని ఎగాదిగా చూసి అడిగాడు భర్త.

''నీలో ఏదో గొప్ప మార్పు కనిపిస్తోంది. ఏమిటది?''

''ఏమో మరి? నాకు తెలీదు.'' జవాబు చెప్పిందామె.

కొన్నేళ్ళుగా కాళ్ళు చచ్చుబడి, మంచం దిగలేని స్థితిలో ఉన్న తన

భర్తకి ఆమె ఆ తర్వాత ఇదివరకటికన్నా ఎక్కువ శ్రద్ధతో సేవ చేయడం మొదలెట్టింది.

## 148. ప్రతిబింబం

ఓ ఊళ్ళోని వేణుగోపాల స్వామి గుడి పూజారి నాలుగేళ్ళ పాటు భక్తి ప్రచారం చేసినా కూడా ఆ గుడికి భక్తులని పెద్దగా రప్పించలేక పోయాడు. దాంతో ఆయన ఓ రోజు ఊరంతా పాంప్లెట్స్‌ని పంచాడు. దాన్లో 'భక్తులు వస్తూంటేనే గుడి జీవిస్తుందని, తమ ఊళ్ళోని గుడి మరణించిందని, దాన్ని మర్నాడు స్మశానానికి తీసుకెళ్ళి కాల్చేస్తున్నానని' పేర్కొన్నాడు. దాన్ని చదివిన చాలామందికి పూజారి స్మశానానికి గుడిని ఎలా తీసుకువెళ్ళగలడా అన్న ప్రశ్న ఉదయించింది. ఏం జరుగుతుందో చూద్దామని మర్నాడు అంతా ఆసక్తిగా స్మశానానికి వెళ్ళారు.

పూజారి వచ్చిన వాళ్ళతో చెప్పాడు.

"మీరంతా ఇవాళ గుడిని ఆఖరిసారి చూసి మీ గౌరవాన్ని ప్రకటించుకోవచ్చు."

అంతా క్యూలో చితి దగ్గరకి వెళ్ళి చూస్తే, ఆ చితిలో సరైన కోణంలో ఉన్న అద్దంలో ప్రతీ వారూ తమ ప్రతిబింబాన్నే చూసారు.

## 149. ద్వేషించక

ఓ రాజుగారికి తమ దేశం వచ్చిన ఓ మహాత్ముడి గురించి తెలిసింది. ప్రజలంతా ఆయన గురించి గొప్పగా చెప్పుకుంటూండటంతో, ఆయన ఎలాంటివాడో స్వయంగా తెలుసుకుందామని మారువేషంలో ఆ మహాత్ముడి దగ్గరకి వెళ్ళాడు. ఆయన పాదాలకి మొక్కి అడిగాడు.

"స్వామీ! నాకేదైనా ఉపదేశం ఇవ్వండి."

"నువ్వు ఎవ్వరి మీదా ద్వేషం పెట్టుకుని పగ తీర్చుకోవద్దు."